# ప్రజాశక్తి

సోమవారం 6 అక్టోబర్ 2025

5

అల్లూరి సీతారామరాజు




## పండిట్ పోస్టులు అప్ గ్రేడ్ చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గిరిజన పండిట్ పోస్టులు అప్ గ్రేడ్ చేయాలని భాష పండితులు ప్రభాకర్, రాజబాబు, గంగా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని 417 పండిట్ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని యాజమాన్య పాఠశాలల్లో వంద శాతం పండిట్, పిఈటి పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగోన్నతి కల్పించారని తెలిపారు. గిరిజన పాఠశాలల పండిట్ పోస్టులు అప్ గ్రేడేషన్ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి ఫైల్ ఆమోదింప చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



వంతెన ప్రాంతం వద్ద బురదమార్గంలో వెళుతున్న వాహనదారులు, గిరిజనులు

## నత్త నడకన చౌంపి వంతెన పనులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-అరకులోయ:**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలంలోని చౌంపికి వెళ్లే వంతెన నిర్మాణం పనులు నత్తనడకన జరుగుతుండడంతో వాహన చోదకులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా సర్వీస్ రోడ్డు వేయక పోవడంతో ఎటు నుంచి వెళ్లాలో అర్థం కాని స్థితి నెలకొందని ఈ ప్రాంతం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. తుపాన్ కారణంగా గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చౌంపికి వెళ్లే దారిలో కొండ వాగు పొంగి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కనీసం తాత్కాలిక రహదారి కూడా ఏర్పాటు చేయక పోవడంతో ఇటీవల ఈ గెడ్డ దాటుతూ ఓ గిరిజనుడు మృతి చెందగా, శుక్రవారం పద్మాపురం పంచాయతీ పరిధి భీముడువలసకు చెందిన గిరిజనుడు వాగు దాటుతూ కొట్టుకుపోతూ సిమెంట్ పిల్లర్ని పట్టుకొని ఉండిపోవడంతో స్థానికులు రక్షించిన విషయం తెలిసిందే. వంతెన నిర్మాణంలో గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణ పనులు చేపట్టి రెండు సంవత్సరాలు కావస్తున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని గిరిజనులు విమర్శించారు. ఏడాది నుంచి కురుస్తున్న వర్షాలకు వాగు ఉధృతికి తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా గుత్తేదారులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసి గిరిజనులకు అందుబాటులోకి తీసుకు రావాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

## అంకితభావంతో నూతన ఉపాధ్యాయులు పని చేయాలి




మాట్లాడుతున్న ఆర్‌జెడి

**ప్రజాశక్తి-అరకులోయ:**నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్జెడి విజయ భాస్కరరావు సూచించారు. మండలంలోని మార్నింగ్ రిసార్ట్స్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన సందర్శించి నూతన డిఎస్సి ఉపాధ్యాయులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. నూతన ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరిస్తూ విధులు నిర్వహించాలని ఆయన హితబోధ చేశారు. ఉపాధ్యాయుల సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎంఈఓలు వి.త్రినాధరావు, భారతిరత్నం, అనంతగిరి ఎంఈఓలు కే.బాలాజీ, బిబి నాగేశ్వరరావు, డుంబ్రిగూడ ఎంఈఓ జి.గెన్ను ఏఎమ్ఓ కే.భాస్కరరావు, స్టేట్ అబ్జర్వర్ బి.రాజు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి ఆధారిత వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి

### -రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛాన్సలర్ విజయ్ కుమార్

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** ప్రకృతి ఆధారిత వ్యవసాయం ద్వారా ఆర్థికాభివృధికి, పర్యావరణ పరిరక్షణకు దోహదం పడుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛాన్సలర్ టి.విజయ్ కుమార్ అన్నారు. పాడేరు మండలంలోని బరిసింగి గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ టి.శ్రీపూజ, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలోని గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కాఫీ, పసుపు, కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు స్థానికంగా తయారు చేసే బయో ఇన్‌పుట్ లు జీవామృతం, ఘనజీవామృతం, నేమ్ కాషాయం మొదలైనవి తయారీని ప్రదర్శించి వివరించారు. అలాగే రీలే క్రాపింగ్ పద్ధతిలో పంటలను సాగు చేయడం ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందుతున్న విధానాన్ని చూపించారు. అధికారులు గ్రామంలోని లీడ్ ఫార్మర్లతో మాట్లాడి, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతం పెరిగిన తీరును, పురుగు సమస్యలు తగ్గిన విధానాన్ని, రైతులకు లభిస్తున్న ఆర్థిక లాభాలను తెలుసుకున్నారు. అధికారులు రైతులను ప్రోత్సహిస్తూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింత విస్తరించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రకృతి ఆధారిత వ్యవసాయం గిరిజన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని వారు పేర్కొన్నారు.



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

## వంతెన లేక గిరిజనుల అవస్థలు

### భయం భయంగా గెడ్డను దాటుతున్న వైనం

**ప్రజాశక్తి -అనంతగిరి:**రెండు జిల్లాల సరిహద్దు గరుగుబిల్లి- కొండపర్తి గ్రామాల మధ్య వంతెన లేక గిరిజనులు నానా అవస్థలకు గురవుతున్నారు. గరుగుబిల్లి పంచాయతీ గరుగుబిల్లి, విజయనగరం జిల్లా ఆంద్రా పంచాయతీ కొండపర్తి గ్రామాల సరిహద్దులో వంతెన నేటి వరకు నిర్మించక పోవడంతో రాకపోకలకు ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగువ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర డ్యామ్‌కు ఈ వంతెన పై నుంచే గెడ్డ భారీ ఎత్తున ప్రవహిస్తుంది. విజయనగరంలో వివిధ పనుల నిమిత్తం అనంతగిరి మండలానికి బీంపోలు, గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీలతో పాటు మండలాని కి చెందిన పలువురు ఈ రహదారిపైనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మెంటాడ మండలం సమీపాంలో అనంతగిరి మండలానికి చెందిన నాన్ షెడ్యూల్ రోంపలి పంచాయతీ ఉంది. ఈ పంచాయతీ పరిధి గ్రామాల గిరిజనులు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో ఈ గెడ్డను దాటి వెళ్ళలేని పరిస్థితి ఉందని రెండు జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు దృష్టి సారించి సరిహద్దు గ్రామాల వద్ద వంతెన నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.



కొండపర్తి, గరుగుబిల్లి గెడ్డను దాటుతున్న గిరిజనులు

## పోడు సాగుపై వివాదం

- తోకరాయి, చోడురాయి గ్రామస్తుల మధ్య ఘర్షణ
- సర్ది చెప్పిన ఎస్ఐ రవీంద్ర

**ప్రజాశక్తి - సీలేరు:** జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి తోకరాయి, గుమ్మిరేవుల పంచాయతీ చోడురాయి గ్రామాల మధ్య పోడు సాగుపై గత కొంతకాలంగా ఇరు గ్రామాల మధ్య వివాదం చెలరేగుతోంది. గుమ్మిరేవుల పంచాయతీ చోడురాయి గ్రామస్తులు ధారకొండ పంచాయతీ పరిధి తోకరాయి గ్రామ సమీప కొండ అంచున చెట్లు నరికి పోడు సాగు చేస్తున్నారు. పోడు సాగు వల్ల కొండపై చెట్లు లేకపోవడం వల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు పైనుంచి మట్టి, రాళ్లు కొట్టుకువచ్చి గ్రామానికి తీవ్ర నష్టం కలుగుతుందని పోడు వ్యవసాయం నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని సీలేరు ఎస్సై రవీంద్రకు, జిల్లా కలెక్టర్‌కు చోడురాయి గ్రామస్తులు గత కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ పలు సూచనలు చేశారు. పోడు వ్యవసాయం జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని జీకేవీధి తహశీల్దార్‌కు ఇటీవల ఆదేశించారు. ఈ క్రమంలో ఆదివారం తోకరాయి, చోడురాయి గ్రామాల మధ్య మళ్లీ ఈ అంశమై వివాదం జరిగింది. చోడురాయి గ్రామకొండ ప్రాంతాల సమీపంలో గిరిజన రైతులు జీడి మొక్కలు నాటుకున్నారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున జీడి మొక్కలు నరికి వేశారు. విషయం తెలుసుకున్న సీలేరు ఎస్సై రవీంద్ర వెంటనే సిబ్బందితో హుటాహుటిన బయలుదేరి అక్కడికి చేరుకున్నారు. జీడి మొక్కలను ఆయన పరిశీలించారు. అనంతరం ఇరు గ్రామస్తులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. పరస్పరం ఎవరూ ఘర్షణ పడవద్దు అనిసమస్యను శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవాలని సున్నితంగా సర్ది చెప్పారు. జరిగిన వివాదాన్ని అధికారుల దృష్టికి ఎస్సై రవీంద్ర తీసుకెళ్లారు.



జీడి మొక్కలను పరిశీలిస్తున్న ఎస్ఐ రవీంద్ర తదితరులు




సమావేశం నిర్వహిస్తున్న ఎస్ఐ రవీంద్ర

## గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్టదా ?

- కురుపాం గురుకుల బాలికలకు మెరుగైన వైద్యం అందించాలి
- మృతులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకుల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినిలకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ కోరారు. చనిపోయిన విద్యార్థులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం ప్రభుత్వానికి పట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర అస్వస్థతకు గురై విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న శివన్నపేట గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు జి.అజయ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయితేజలతో కలిసి ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు సరైన వైద్యం అందలేదన్నారు. బాధిత విద్యార్థులంతా ఇప్పటికే పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం ఆసుపత్రుల్లో చికిత్స కోసం చేరారని, వారిలో తీవ్ర అస్వస్థతకు గురైన 37 మందిని విశాఖ కెజిహెచ్‌కు తరలించారని తెలిపారు. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వారి సంక్షేమంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నెల రోజుల క్రితం పార్వతీపురం కలెక్టరేట్ దగ్గర జరిగిన ధర్నాలో ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న సమస్యలను అధికార యంత్రాంగానికి తాము తెలియజేశామని, వాటిని పరిష్కరించకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని అన్నారు. సరైన తాగునీరు, వాష్‌రూమ్స్, విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, బస గదులు, డైనింగ్ హాలు వంటి సదుపాయాలు లేనందువల్లే ఇటీవల ఇద్దరు విద్యార్థులు ఆ పాఠశాలలో మరణించారని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడ్డారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, కెజిబివిలు, గురుకులాల్లో తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రవీడి, రెగ్యులర్‌గా హెల్త్ చెకప్‌లు చేయాలన్నారు. చాలాచోట్ల హెల్త్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. ఈ సమస్యపై పోరాడుతున్నా సర్కారుకు పట్టలేదన్నారు. కురుపాం విద్యార్థినుల అనారోగ్య పరిస్థితులు వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

## పలువురికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి - రంపచోడవరం :** రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక సిరిగిందాలపాడు రామకృష్ణమిషన్ వద్ద ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజి మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. 47 మందికి రక్తపరీక్షలు , ఎక్స్‌రేలు,ఈసిజీ, థైరాయిడ్ టెస్ట్, ఫిజియోథెరపీ నిర్వహించినట్లు స్వామిజీ తెలిపారు. శిబిరంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఇన్‌చార్జి స్వామి లోకమయనందా మహారాజ్ వైద్యశిబిరంలో పాల్గొని ఏజెన్సీలో రామకృష్ణ మిషన్ నిర్వహిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు, సహాయకులకు అన్నదానం.నిర్వహించినట్లు స్వామిజీ తెలిపారు. శిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ శ్రీనివాస్ రాయుడు, డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ సంపత్‌కుమార్ రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల సిబ్బంది, మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ కానుమోని శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ ఉద్యోగాల సాధన కమిటీ నాయకులు

## 13న చలో ఐటిడిఎను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి -రంపచోడవరం :** గెద్దాడ పంచాయతీ, చెరుపాలెం గ్రామప్రజలు ఆదివాసీ హక్కులు-ఉద్యోగాల సాధన కమిటీ రంపచోడవరం డివిజన్ గౌరవ అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, సాధల విద్యాసాగర్‌రెడ్డి రంపచోడవరం మండల గౌరవ అధ్యక్షులు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, యువతని కలిసి, చలో ఐటిడిఎ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ చలో ఐటిడిఎ కార్యక్రమానికి ఊరంతా కదిలి రావాలని, రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని, అవిధంగా ఆలోచించడం మంచి నిర్ణయం అని, ఆవిధంగా అన్ని గ్రామాల ప్రజలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో అన్నిక అప్పా రావు, తుంబుడు వెంకటరెడ్డి, పూల గంగిరెడ్డి, తుంబుడు చిరంజీవిరెడ్డి, అన్నిక చిన్నరావు తదితరులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణులను, అటవీ సంపదను కాపాడుకోవాలి

**ప్రజాశక్తి-వి.ఆర్.పురం:**

అటవీ సంరక్షణకు, వన్యప్రాణుల సంరక్షణకు అంతా సహకరించాలని ఆదివారం జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి డిఆర్ఒ శ్రీనివాసరావు అన్నారు. జెడ్‌పిటిసి వైల్డ్ లైఫ్ ఏరియాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ అటవీ రక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. అడవిలో నిప్పు పెట్టడం నేరమని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవులు సంరక్షించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కూడాప్రతి ఒక్కరి బాధ్యత అని దానికి అంతా సహకరించాలని సూచించారు. గ్రామస్తులు, ఉద్యోగులు హాజరయ్యారు.




ప్రచారం చేస్తున్న డిఆర్ఒ శ్రీనివాసరావు

## శ్రమదానంతో మట్టి రోడ్డు పనులు



గోతులు పూడుస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని తీగల వలస పంచాయతీ నుంచి పనసబంధ గ్రామం వరకు సుమారు 2 కిలోమీటర్ల మట్టి రోడ్డు వర్షాలకు కోతకు గురై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో పనసబంధ గ్రామస్థులు ఆదివారం శ్రమదానంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. 40 మంది గిరిజనులు కలిసి కోతకు గురైన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడంలోనూ, పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణానికి కావలసిన ఇసుక, సిమెంట్ తదితర సామగ్రి రవాణాలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు చెప్పారు. రహదారి దెబ్బతినడంతో వాహనాలు నడవక ఇళ్ల నిర్మాణం ఆగిపోయిందని స్థానికులు తెలిపారు. 2017 సంవత్సరంలో ఈ మట్టి రోడ్డు కోసం గ్రాంట్ మంజూరైనప్పటికీ, అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ పెద్దలు కిల్లో వంశీ, సీదారి చందు (వార్డు సభ్యుడు), సీదారి చిట్టిబాబునాయుడు, సీదారి బాలరాజు, బింబాబు, సన్యాసిరావు తదితరులు విజ్ఞప్తి చేశారు.

## అదాని సిమెంట్‌ను వ్యతిరేకిస్తూ ప్రచార జాతా

ప్రజాశక్తి -గాజువాక : అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం పాత గాజువాకలో ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, అదాని సిమెంట్ పరిశ్రమ ఏర్పడితే గాజువాక మొత్తం ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే అదాని గంగవరం పోర్టుతో గాజువాక నియోజకవర్గం మొత్తం కాలుష్యమయమైందన్నారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే నీటి, శబ్ద కాలుష్యంతో పాటు నైట్రేట్, కార్బన్‌డయాక్సైడ్ వంటివి విడుదలై ప్రజల ఆరోగ్యం పాడవుతుందని తెలిపారు. ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయని ఆవేదన వ్యక్తంచేశారు.

సిపిఎం స్టీల్ జోన్ నాయకులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అదాని సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతి ఇచ్చి ప్రజలను అనారోగ్యాలపాల్జేస్తుందని విమర్శించారు. ఈ నెల 8వ తేదీన జరిగే ప్రజాభిసేకరణలో పెద్ద ఎత్తున ప్రజల పాల్గొని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, గంగవరం పోర్టుకు వచ్చివెళ్లే వాహనాలతో 100 అడుగుల రోడ్డు నుండి వై.జంక్షన్ వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అదాని సిమెంట్ పరిశ్రమ వస్తే మరింత దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ నాయకులు ఎల్.బంగారినాయుడు, ఎ.లోకేష్, గొలగాని అప్పారావు, బి.అప్పారావు, జి.రాము, నానాజీ, స్టీల్ జోన్ నాయకులు నమ్మి రమణ, వైటి.దాస్, అప్పలరాజు, ఒవి.రావు పాల్గొన్నారు.

**అదాని సిమెంట్‌ను అడ్డుకుంటాం**

అదాని సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని వైసిపి 76వ వార్డు అధ్యక్షుడు మంత్రి శంకర్ నారాయణ చెప్పారు. నడుపూరులో ఆదివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శంకరనారాయణ మాట్లాడుతూ, అదాని సిమెంట్ ఫ్యాక్టరీపై ఈ నెల 8వ తేదీన జరిగే పబ్లిక్ హియరింగ్‌కు అందరూ హాజరై వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే అదాని గంగవరం పోర్టుతో దుమ్ము, ధూళి వస్తుందని, ఇది చాలదన్నట్లు సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తూ ఇప్పటికే పెదగంట్యాడ తహశీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశామన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో తాడికొండ జగదీష్, తలారీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# అధ్వానంగా వంజంగి రహదారి

**-నెల రోజుల్లో ప్రారంభం కానున్న పర్యాటక సీజన్**
**-పర్యాటకులు, గిరిజనులకు తప్పని అవస్థలు**



కోతకు గురై ప్రమాదకరంగా వంజంగి రోడ్డు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రముఖ సందర్శనీయ ప్రదేశం వంజంగి హిల్స్ కు వెళ్లే మార్గం అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు గిరిజనులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు నుంచి వంజంగి హిల్స్ కు చేరుకునేందుకు 6 కిలోమీటర్ల వరకు తారురోడ్డు ఉంది. కాగా అక్కడి నుంచి వంజంగి హిల్స్ కూడలి, కొత్త వలస గ్రామానికి 2020లో రూ.2 కోట్ల 19 లక్షల వ్యయంతో 5 కిలోమీటర్ల మేర తారురోడ్డు వేశారు. పర్యాటకులు వంజంగి గ్రామం నుంచి కొండపైకి వెళ్లాలంటే ఈ రోడ్డు మార్గంలోనే వెళ్లాలి. 2020లో రోడ్డు పూర్తికావడం, అప్పుడే వంజంగి మేఘాల కొండలు వెలుగులోకి రావడంతో రోడ్డుపై పర్యాటకుల రాకపోకలు సాగుతోంది. అయితే 2022 నుంచి రోడ్డు గతుకులు, కోతకు గురైంది. దీంతో ప్రయాణం చాలా కష్టంగా మారింది. వంజంగి హిల్స్ రహదారి అద్వానంగా ఉండడంతో ఈ మార్గంలో ప్రయాణించే పర్యాటకులు, గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా వంజంగి హిల్స్ కు వెళ్లాలి. ప్రతి ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పర్యాటకులు అత్యధిక సంఖ్యలో వంజంగి హిల్స్ ను సందర్శిస్తుంటారు. మరో 20 రోజులు పర్యాటక సీజన్ పూర్తిగా ప్రారంభం కానుంది. దీంతో అధిక సంఖ్యలో పర్యాటకులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. అలాగే వంజంగితోపాటు ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గంపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మలుపుల వద్ద రాళ్లు తేలిపోవడం, రోడ్డు గతుకులు, కోతకు గురై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కొత్తగా ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, పర్యటకుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

వంజంగి గ్రామం నుంచి హిల్స్ కూడలి మీదుగా కొత్తవలస గ్రామం వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల రోడ్డును 2020లో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా నిర్మించారు. అప్పటి వరకు ఆ ప్రాంతానికి ఎటువంటి రోడ్డు మార్గం లేదు. పిఎంజిఎస్ వైలో తారురోడ్డు నిర్మించిన తరువాతనే వంజంగి మేఘాల కొండ వెలుగులోకి వచ్చింది. అయితే ఐదేళ్ల క్రితం రోడ్డు నిర్మించడం మినహా, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డుకు ఎటువంటి నిర్వహణ చేపట్టిన దాఖలాలు లేవన్న ఆరోపణలు ఉన్నాయి. వంజంగి హిల్స్ పర్యాటకంగా ప్రాచుర్యం పొందినప్పటికీ, ఈ మార్గం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో రోడ్డు పాడవడంతో పాటు వర్షాలకు రోడ్డు అంచులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డు ఇరుకుగా మారడంతో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో ఏమాత్రం ఏమరు పాటుగా ఉన్నా వాహనాలు అదుపు తప్పి లోయలోకి పోయే ప్రమాదముంది. వాస్తవానికి పిఎంజిఎస్‌వై నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ ఐదేళ్ల పాటు రోడ్డు నిర్వహణ పనులు చూడాలి. కానీ కాంట్రాక్టర్, ఇంజనీర్లు కుమ్మక్కుకావడంతో పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరో నెల రోజుల్లో పర్యాటక సీజన్ ప్రారంభం కానుండడంతో త్వరిత గతిన ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక గిరిజనులు, పర్యాటకులు కోరుతున్నారు.

# ఎకో టూరిజం ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలి

**- మాడగడ గ్రామస్తుల డిమాండ్**



నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండలం మాడగడ మేఘాల సన్రైజ్ వ్యూ పాయింట్ స్థలం 84 సర్వే నెంబర్ల కొండపోడు భూ స్థలమని, ఈ స్థలంలో గతంలో మాడగడ గ్రామానికి చెందిన నలుగురు రైతులకు చెందిన 12 ఎకరాలు డి ఫారం పట్టాలు ఇచ్చి ఉన్నారని, ఈ ప్రాంతంలో ఎకో టూరిజం ప్రాజెక్టు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసన చేపట్టారు. మాడగడ గ్రామానికి చెందిన నలుగురు రైతులు సాగు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. వ్యూ పాయింట్ ఫారెస్ట్ స్థలమా లేదా, రెవిన్యూ స్థలమని, నిర్ధారణ రాకుండానే ఫారెస్ట్ అధికారులు గిరిజనులు కర్రలతో ఏర్పాటు చేసిన వ్యాపార అలంకరణ సముదాయాలను ఎటువంటి సమాచారం లేకుండా సుమారు రెండు లక్షల విలువ కలిగిన ఆస్తిని ధ్వంసం చేసి అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడం సరికాదని గిరిజనులు మండిపడుతున్నారు. పర్యాటకులపై ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్న ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు పొందేవారని, ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా స్థలం మాదని ఫారెస్ట్ అధికారులు సన్ రైజ్ పాయింట్ పర్యాటకులు రాకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పొందుతున్న వారు స్వయంగా నిర్వహించుటకు అనుమతి ఇవ్వవలసినదిగా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇవ్వగా ఫారెస్ట్, రెవిన్యూ జాయింట్ సర్వే నిర్వహిస్తామని చెప్పి ఆదేశాలు జారీ చేశాన్నారని గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయమై పాడేరు డివిజన్ సిడిఎఫ్‌ఓకు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. జాయింట్ సర్వే నిర్వహించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చి తీరా గిరిజనులకు మోసం చేయడం ఎంతవరకు సమంజసం గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల జీవన ఉపాధికి ఉపయోగపడే వ్యూ పాయింట్ ఉండాలని, లేని పక్షంలో సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించదులేదని గిరిజనులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రోడ్డుపై బైఠాయించి పర్యాటకులను అడ్డుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పేసా కార్యదర్శి బిసుమన్, యూనియన్ లీడర్ ఎస్ రామకృష్ణ, డి చిన్నబాబు, స్వయం ఉపాధి పొందుతున్న గిరిజనులు ఉన్నారు.

## నేరాలు ఘోరాలు

### ఆటో బోల్తా : డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడిన ఆటో

ప్రజాశక్తి- వద్దాది : బుచ్చయ్య పేట మండలం విజయరామరాజుపేట.తాచేరు వంతెనపై ఆటో బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాచేరు వంతెన కొట్టుకుపోవడంతో బిఎన్ రోడ్డులో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజల ఇబ్బందులు దృష్ట్యా, అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వారం రోజులుగా గొట్టాలు పేర్చి, మట్టిని కప్పి రాకపోకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే కురుస్తున్న వర్షాలకు మట్టి బురదయమం, గోతులు కావడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలు స్కిడ్ అవుతూ ప్రమాదానికి గురౌతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం టాటా ఏస్ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. అధికారులు స్పందించి రహదారిని పటిష్టం చేయాలని పలువురు కోరుతున్నారు.

## కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి- గాజువాక : పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని ఆల్ పెన్షనర్ రిటైర్డ్ అసోసియేషన్ నాయకులు కె.పరంధామయ్య డిమాండ్‌చేశారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పెన్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరంధామయ్య మాట్లాడుతూ, భారతదేశంలో 78 లక్షల మంది పెన్షన్‌దారులు ఉన్నారని తెలిపారు. ఉద్యోగి 35 సంవత్సరాలు పాటు సర్వీస్ చేస్తే రూ.వెయ్యి నుంచి రూ.3000 మాత్రమే పెన్షన్ వస్తుందన్నారు. మినిమం పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, దానికనుగుణంగా డిఎ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అసోసియేషన్ జిల్లా నాయకులు కె.దీనబంధు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పుకు మూడేళ్లు గడిచినా 95 పెన్షన్‌దార్లకు ఆ తీర్పు అమలు కాలేదని తెలిపారు. ఈ సమావేశంలో నమ్మి అప్పలనాయుడు, మేడిశెట్టి వెంకటరావు, మంత్రి గోపీనాథ్, బెల్లాల్ నాగేశ్వరరావు, శేసెట్టి అప్పారావు, శ్రీనివాస్, నరసింహులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటుపరం చేసే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి : వైసిపి

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటుపరం చేయడానికి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఆనందపురంలోని ఒక కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి అమలుచేయడంలేదన్నారు. వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

విద్య, వైద్య రంగాలకు వైసిపి ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యతనిచ్చినప్పటికీ, కూటమి పాలకులు ప్రయివేటీకరణ దిశగా నడుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంపదను పిపిపి పేరుతో ప్రయివేటు చేతుల్లోకి వెళ్లేలా చూస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన 17 మెడికల్ కళాశాలలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రజల ఆరోగ్య హక్కులపై దెబ్బ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యాచారాలు, నేరాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. పాయకరావుపేటలో బల్క్ డ్రగ్స్ పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు వైసిపి మద్దతు ఉంటుందని తెలిపారు. విశాఖలో ప్రభుత్వ భూములను అమ్మడం, అమరావతికి అప్పులు చేయడం తప్ప రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. వంశధార ప్రాజెక్టు 1955లో ప్రారంభమైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## సిపిఎం నాయకులపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-విఆర్‌పురం: సిపిఎం నాయకులు, ప్రజాప్రతినిధులపై కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వారు చేస్తున్న ఆరోపణలపై చర్చకు సిద్ధమా అని మాజీ సర్పంచ్ ఆసు లక్ష్మయ్య సవాల్ విసిరారు. రామవరం గ్రామంలో ఆదివారం సిపిఎం ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామవరం మాజీ సర్పంచ్ ఆసు లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ మధ్య మండలంలో కొంతమంది బిజెపి పేరు చెప్పుకుని సిపిఎం నాయకులపై తప్పుడు ప్రకటనలు ఇస్తూ బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారని దీన్ని సిపిఎం సహించదని హెచ్చరించారు. రెండు రోజుల్లో రేఖపల్లి వచ్చి చర్చకు రావాలని సవాల్ విసిరారు. అన్నవరం బ్రిడ్జి అధ్వానంగా తయారైంది, పోలవరం బ్యాక్ వాటర్‌లో మునిగిపోయిన పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు అవస్థలు పడుతున్నారని ఇటువంటి సమస్యలపై పోరాటం చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సుందరయ్య, గొర్రెరాజు, పులి బోజ్జి, వద్దాది రమేష్ పాల్గొన్నారు.

## సప్పర్ల పిహెచ్‌సిలో వైద్యాధికారిని తక్షణమే నియమించాలి

ప్రజాశక్తి - సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం సప్పర్ల పిహెచ్‌సిలో వైద్యాధికారులను తక్షణమే నియమించాలని సిపిఎం కార్యదర్శి అప్పలరాజు బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత 20 రోజుల క్రితం వైద్యాధికారిని వేరే ప్రాంతానికి బదిలీ చేశారని అప్పటినుంచి వైద్యాధికారి లేక వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వైద్యాధికారిని బదిలీ చేసే ముందు వేరొక వైద్యాధికారిని పిహెచ్‌సికి నియమించి విధుల నుంచి రిలీవ్ చేయాలని అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యాధికారులను బదిలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించి వైద్యాధికారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం సీలేరు దారకొండ స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు సీలేరులో నిర్వహించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. తరచు ఉపాధ్యాయ శిక్షణ తరగతులు సుదీర్ఘమైన ప్రాంతంలో నిర్వహించడం వలన ప్రయాణ సౌకర్యానికి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. పాడేరు ఏజెన్సీ డిఇఒ జికె వీధి ఎంఇఒ తరపున ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ఉదార స్వభావంతో పునరాలోచన చేసి సీలేరులో శిక్షణ తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండు స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు జికెవీధి మండలం శిక్షణ తరగతులకు వెళ్ళాలంటే 50 కిలోమీటర్లు వెళ్ళాల్సి ఉండగా రహదారి సౌకర్యం లేక బస్సు సకాలంలో రాక శిక్షణ తరగతులకు హాజరు కాలేకపోయిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. అధికారులు ఉపాధ్యాయుల సమస్యను దృష్టిలో ఉంచుకుని సీలేరులో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరారు.



ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభిస్తున్న జెసిసి మాజీ చైర్మన్ ప్రసాద్

## ఆటోడ్రైవర్ల కష్టం తెలిసిన ప్రభుత్వం

ప్రజాశక్తి -కొయ్యూరు: జెసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో లేని పథకాన్ని కూడా పేదల కష్టం తెలుసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన ప్రతిడ్రైవర్‌కు రూ.15 వేలు ఆర్థిక సహాయం ప్రతి ఏడాది అందించనుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యూరులో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొయ్యూరు మండలంలో ఆటో డ్రైవర్ల యూనియన్ వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టిడిపి సర్పంచ్ బాలరాజు, శ్రీను, ఆర్. చంద్రరావు, అరిమెలారావు భాషా, గోవిందు ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 'వేణుగోపాలరావు సేవలు మరువలేనివి'



మాట్లాడుతున్న పి.ఎస్.అజయ్‌కుమార్

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: ఫిలిం సొసైటీ స్థాపించి సినీ రంగానికి ఆచార్య వేణుగోపాలరావు సేవలు అందించారని అనకాపల్లి ఫిలింసొసైటీ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆచార్య వేణుగోపాలరావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో వేణుగోపాలరావు స్మార కోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి సినిమాల కోసం ఆచార్య వేణుగోపాలరావు పరితపించారని, ఫిలిం సొసైటీని స్థాపించి, ఫిలిం ఎక్స్‌ప్రెషన్ కోర్సు ప్రవేశపెట్టారన్నారు. సినిమాలు సమాజంపై చూపించే ప్రభావం గూర్చి వివరించారు. గురజాడ కన్యాశుల్కం నాటకం స్టేజిపై ఒకలా ఉంటుందని, ఎన్టీఆర్ నటించిన సినిమాలో జీవితానికి దగ్గరగా ఉంటుందని చెప్పారు. కేరాఫ్ కంచరపాలెం సినిమా వాస్తవానికి దగ్గరగా, చుట్టూ జరుగుతున్నట్లు ఉంటుంద న్నారు. అటువంటి సినిమాలు రావడం అరుదుగా జరుగుతుంది జీవితానికి దగ్గరగా ఉండే సినిమాలు రావాలని వేణుగోపాలరావు ఆకాంక్షించే వారిని చెప్పారు. మలయాళం సినిమా దిగ్రేట్ ఇండియన్ కిచెన్ తెలుగులో అనకాపల్లిలో ప్రదర్శించామని, సినిమాలో మహిళల శ్రమను తెలియజేసిందన్నారు. మంచి సినిమా చూసే ప్రేక్షకులు దేశంలో లేరని దర్శకుడు సత్యజిత్ రే ఆవేదన వ్యక్తం చేసే వారని గుర్తు చేశారు. వ్యక్తి ఎప్పుడు ప్రేక్షకునిగా, మనిషిగా ఉండాలని వేణుగోపాలరావు ఆకాంక్షించే వారని తెలిపారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.సుధా 'ప్రపంచం గాజా హత్యలకు ముందు తర్వాత' అనే అంశంపై మాట్లాడుతూ పాలస్తీనాకు మాతృభూమి లేకుండా చేస్తుండడం బాధాకరం అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి పాలస్తీనా కు రీమ్ ల్యాండ్ లేకుండా చేస్తున్నార న్నారు. ఇజ్రాయిల్ మంత్రులకు మనదేశం రెడ్‌కార్పెట్ వేస్తూ ట్రేడ్ ఒప్పందం చేసుకుంటున్నారని మండిపడ్డారు. గాజాకు మద్దతుగా నిలిచిన వారిపై పథకం ప్రకారం దాడులు చేసి హతమారుస్తున్నారని దీనిని మానవతావాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ న్యాయవాది వి.కళ్యాణ రామారావు మాట్లాడుతూ మానవ హక్కులపై వేణుగోపాలరావుకి అవగాహన ఉందన్నారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎక్స్ప్రెషన్‌లో తేడా వచ్చిందన్నారు. ఇందువలన ఇంటర్నెట్, మీడియాపై ఆంక్షలు విధించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ఆర్టికల్ 21 రైట్ టు లిప్ కల్పించిందని,అయితే ఆర్టికల్ 19కు దానిని లింక్ చేసిందని వివరించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత కొద్దిరోజుల్లోనే ఒకటి ఆర్ఎస్ఎస్ పత్రికపై, రెండో కేసు వామపక్షాల పత్రికపై వచ్చిందన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ రిటైర్డ్ ఉద్యోగి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో విమర్శకుల వర్మ, హెచ్ఆర్ఎఫ్ నాయకులు వి.ఎస్.కృష్ణ, అనురాధ, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు వై.నూకరాజు, రాం ప్రభు, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

# నేడు నావికాదళంలోకి ఐఎన్ఎస్ ఆండ్రోత్

**- ఎన్నో ప్రత్యేకతలు ఈ యుద్ధనౌక సొంతం**

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో రెండో యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ నౌక ఆండ్రోత్ సోమవారం భారత నావికాదళంలోకి చేరనుంది. సోమవారం ఉదయం విశాఖలోని నావల్ డాక్ యార్డులో జరగనున్న జల ప్రవేశ ఉత్సవ కార్యక్రమంలో తూర్పు నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అధ్యక్షతన దీనిని ప్రారంభించనున్నారు. కొల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ నిర్మించిన ఈ నౌక 'ఆత్మనిర్భర్ భారత్'కు ప్రతీక అని అధికారులు చెబుతున్నారు. 80 శాతానికిపైగా స్వదేశీ పరికరాలను దీని తయారీలో ఉపయోగించారు. దీనికి లక్షద్వీప్ దీవుల సమూహంలోని వ్యూహాత్మక ప్రాధాన్యతగల ఆండ్రోత్ ద్వీపం పేరు పెట్టారు. ఈ నౌక నిర్మాణం 2023 మార్చిలో ప్రారంభమైంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత నేవీకి అప్పగించారు. ఈ నౌకను వినూత్న సాంకేతికతలు జోడించి స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించడానికి రూపొందించారు. దీంతో నేవీ యాంటీ సబ్‌మెరైన్ వార్ సామర్థ్యాలు గణనీయంగా బలపడనున్నాయి. ముఖ్యంగా సముద్ర జలాల్లో ముప్పులను ఎదుర్కోవడంలోనూ, దేశ సముద్ర భద్రతా నిర్మాణాన్ని బలోపేతం చేయడంలోనూ ఇది కీలకపాత్ర పోషించనుంది. ఇటీవల కాలంలో పలు అత్యాధునిక యుద్ధనౌకలు నావికాదళంలో చేరాయి. ఐఎన్ఎస్ అర్నాలా, ఐఎన్ఎస్ నిస్టార్, ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ నీలగిరి వంటి నౌకలు తాజాగా భారత నావికా దళంలోకి చేరగా, ఇప్పుడు ఐఎన్ఎస్ ఆండ్రోత్ వాటి సరసన చేరనుంది.

**ఆండ్రోత్ ప్రత్యేకతలు**

ఇది సుమారు 77.6 మీటర్ల పొడవు, 900 టన్నుల బరువు కలిగి, గరిష్టంగా 25 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు. అత్యాధునిక తేలికపాటి టార్పెడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు, అధునాతన సోనార్ వ్యవస్థలతో సహా ఆధునిక ఆయుధాలు, సెన్సార్లు దీనిలో అమర్చబడ్డాయి. ఇది లోతు తక్కువగా ఉన్న నీటిలో కూడా సమర్థవంతంగా పనిచేయగలదు. ఐఎన్ఎస్ ఆండ్రోత్ పేరుతో 1972-1999 మధ్య కాలంలో భారత నౌకాదళంలో ఒక అర్నాలా తరగతి కార్వెట్‌గా ఒక నౌక సేవలు అందించింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన నౌక దాని వారసత్వాన్ని కొనసాగించనుందని అధికారులు తెలిపారు.



ఐఎన్ఎస్ ఆండ్రోత్



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి -గంగవరం : గంగవరం గ్రామం మధ్య విధి సినిమా కాలనీలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు వెయ్యిమంది భక్తులు అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కుంజం రాంబాబు, వనిత, ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.




గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న జెడి ఫౌండేషన్ సభ్యులు

## వస్త్ర సంచుల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోరమండల్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం సహకారంతో భక్తులకు వస్త్రసంచులు పంపిణీ చేశారు. దేవస్థానం వేదపండితులు ఎం.భీమశంకరశాస్త్రి, వి.హనుమాన్‌శర్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిని ప్రజలు విడనాడాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, జెడి ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడిఅను, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, జెడి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా దేవళంపేటలో ఈ నెల 3న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని, భీమ్‌సేన వైజాగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి రవి సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఎల్ఐసి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం కారణంగా, దళితులపై ఈ నాటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఇటువంటి దాడులకు పాల్పడే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

## నేడు స్వచ్ఛ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర (ఎస్ఎఎస్ఎ) కార్యక్రమం నిర్వహించి ఉత్తమంగా నిలిచిన వారికి అవార్డులను సోమవారం ప్రధానం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు సిరిపురం వద్ద వుడా చిల్డ్రన్ ఎరీనానందు సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి, జిల్లా ఇన్చార్జ్‌మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.